

హైదరాబాద్ వార్త

## పదో అంతస్తు పైనుంచి పడి కూలీ దుర్మరణం

నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : పదో అంతస్థు పైనుంచి కిందపడ్డ కూలీ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని కోకాపేట్ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాడులు కృష్ణారావ్ బతుకుదెరువు కోసం భార్య, బిడ్డలతో కలిసి హైదరాబాద్ నగరానికి వలస వచ్చాడు. కోకాపేట్‌లోని గ్రీన్‌స్పేస్ సెల్లిస్టెక్ భవనంలో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం పనికి వెళ్లిన ఆయన పని పూర్తయ్యాక కిందికి వస్తూ 10.వ,అంతస్థు పైనుంచి కాలుజారి కింద పడ్డాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న 108.అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి, తలకు తీవ్రమైన రక్తస్రావం అవ్వడంతో అప్పటికే మృతి చెందాడని స్పష్టం చేశారు. దీంతో తోటి కూలీలు మృతుడి భార్యకు సమాచారం ఇచ్చారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తర లించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



**కోకాపేట్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పదో అంతస్థు పైనుంచి పడి దుర్మరణం చెందిన కూలీ కృష్ణారావు మృతదేహం**



## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

రవీంద్రభారతి, అక్టోబరు 30 ప్రభాతవార్త : తెలుగుజాతి స్వంతమైన కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం కావించడంలో ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు పద్మభూషణ్ డా. వెంపటి చినసత్యం పాత్ర ఎనలేనిదని, ఆయన 94వ జయంతిని భారత ఆర్ట్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్‌ల అధ్యక్షులు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితారావుల నేతృత్వంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సిరిసిరి మువ్వలు శీర్షికన సంప్రదాయ కూచిపూడి నృత్యాంశాలను వందలాదిమంది కళాకారులతో పలు నృత్యాంశాలతో నిర్వహించడం అభినందనీయకమని ముఖ్యఅతిథి తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు.

## కార్వాన్‌లో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

మెహిదీపట్నం, అక్టోబర్ 30, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయినాయి. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు కార్వాన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.కొమరయ్య తెలిపారు. ఎన్నికల నిర్వాహణ కోసం ఒక ఆర్ఓ, నలుగురు ఏఆర్ఓలతో కలిపి మొత్తం 30 మంది అధికారులు విధులను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. నవంబర్ 30న నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో ఆయన అధికారులతో కలిసి సోమవారం కార్వాన్ నియోజకవర్గ పరిధిలోని మోడల్ పోలింగ్ బూత్‌ల పేరుతో ఏర్పాటు చేసిన 5 పోలింగ్ బూత్‌లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి అహల్య, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.

# జంప్ జిలానీలు

ఈ రోజు ఈ పార్టీ, రేపు ఇంకో పార్టీ అన్నట్లు తయారైంది పలువురు నాయకుల వ్యవహారం. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీల్లోకి వలసల పరంపర కొనసాగుతున్నది. చేరికలపై ఇప్పటి వరకు చోటా మోటా నాయకులు అడపా దడపా పార్టీలు మారారు. ప్రస్తుం చేరికల పర్వం జోరందుకుంది. అభ్యర్థులు కాలనీల్లో పర్యటించిన సమయంలో తమ పార్టీల కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా యువతపైనే దృష్టి సారించారు. ద్వితీయ శ్రేణి ఓటర్లను , కొద్దో గొప్పో ఓటర్ల వద్ద పలుకుబడి కలిగిన వారిని చేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఎప్పటి నుంచో పార్టీ మారాలని చూస్తున్నవారు ఇదే అదనుగా భావిస్తున్నారు.



- ✦ పార్టీలు మారుతున్న నేతలు
- ✦ అసంతృప్తి నేతల తర్జనభర్జన
- ✦ ద్వితీయ శ్రేణి, యువతే టార్గెట్
- ✦ పావులు కదుపుతున్న నాయకులు
- ✦ ఎటు వెళ్లాలో తెలియక అయోమయం

హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి. ముఖ్యంగా అంబర్‌పేట, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పలువురు నాయకులు ఇటు నుంచి అటు. అటు నుంచి ఇటు పార్టీ మారుతున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ వారు, సముచిత స్థానం దక్కనివారు పక్క పార్టీల్లోకి వెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు. తమ వర్గీయులు, సహచరులతో అంతర్గత సమావే శాలు నిర్వహిస్తూ ఏదో ఒక నిర్ణయం తీసుకునేం దుకు సిద్ధమవుతున్నారు. సాధారణంగా ఎన్నికలు వచ్చాయంటే ఆ గట్టునుంటావా.. ఈ గట్టునుంటావా.. అని నేతలు అడుగుతుం టారు. కానీ ఈ ఎన్నికల్లో ఈ సిన్ రివర్స్ అవుతోంది. ఏ గట్టునుం డాలో అర్థం కాని అయోమయ పరిస్థితి వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, యువకులకు ఎదురవుతోంది. ఒక పార్టీ కండువా వేసుకోగానే మరో పార్టీ నాయకులు వారిని కలిసి తమ వైపు లాగేస్తున్నారు. ఈ లోపే అవతలి పార్టీ వాళ్లు బలవంతంగా కండువా కప్పేస్తున్నారు. ఇలా పోటాపోటీగా చేరికలు జరుగుతుండడంతో ఒక్కోసారి ఏ పార్టీలో ఉన్నారో వారికే అర్థం కాని పరిస్థితులు నెలకొంటున్నాయి.ఎన్నికల వేళ కండువా మార్చే నాయకులు ఎక్కువైపోయారు.

## 12 రకాల్లో ఏదో ఒకటి

**ఓటు వేయడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి**



హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో ఓటు వేయడానికి గుర్తింపుకార్డు తప్పనిసరిగా వెంట తీసుకోవాల్సి ఉంటుంది. భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 12 రకాల కార్డుల్లో ఏదో ఒకదానిని పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఆ కార్డులో యజమాని చిత్రం, పేరు, ఓటరు జాబితాతో సరిపోల్చి ఓటు వేసేందుకు సిబ్బంది అనుమతి ఇస్తారు. ఓటరు జాబితాలో పేరు నమోదైతే గుర్తింపుకార్డుతో ఓటు వేయవచ్చు. **గుర్తించేవి ఇవే..** 1, ఆధార్‌కార్డు, 2, పాన్‌కార్డు, 3,డ్రైవింగ్ లైసెన్స్, 4. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, 5 కార్మికశాఖ జారీ చేసిన అరోగ్య బీమా స్మార్ట్ కార్డు, 6. ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, 7.పింఛను మంజూరు పత్రం, 8. ఫొటో ఉన్న ప్రభుత్వ రంగ, లిమిటెడ్ సంస్థల ఉద్యోగి గుర్తింపుకార్డు, 9. ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలకు జారీ చేసే గుర్తింపుకార్డు, 10. పాస్‌పోర్టు, 11.దివ్యాంగుల గుర్తింపు కార్డు, 12 బ్యాంకు పాస్ పుస్తకం లేదా తపాలాశాఖ జారీ చేసిన పాస్ పుస్తకం.

## పోలీసుల విస్తృత తనిఖీలు

**ద్విచక్రవాహనదారుడి వద్ద రూ,17.40లక్షలు లభ్యం**



**పట్టుబడిన నగదు, వివరాలు వెల్లడిస్తున్న సిఐ రామక్రిష్ణ**

దుండిగల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ఎన్నికల విధుల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండి మైసమ్మ చౌరస్తాలో ఎస్‌వోటి, దుండిగల్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా అతని దగ్గర భారీగా నగదు లభ్యం కావడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ రామక్రిష్ణ తెలిపిన ప్రకారం..ఎన్నికల విధుల్లో భాగంగా ఎస్‌వోటి, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా గండిమైసమ్మ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తున్నాము. ఓ ద్విచక్రవాహనదారుడిపై అనుమానం రావడంతో అతని వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేయగా వాటిలో రూ,17లక్షల 40వేల నగదు లభ్యమైంది. నగదు సంబంధించి ఎటువంటి వివరాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నాము. సదరు నగదును ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం స్క్రీనింగ్ కమిటి అప్పగిస్తున్నట్లు పేర్కొనాననరు. లభ్యమైన నగదు విధి నిర్వాహణలో తరలిస్తున్నాడా లేదా రాజకీయ పార్టీ నాయకులకు సంబంధించిందా తెలియాల్సి ఉంది. ఎన్నికల నియమావళి ప్రకారం రూ,50వేలకు పైగా నగదును తరలించాలంటే దానికి సంబంధించిన పూర్తి వివరాల ఆధారాలతో సహా తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

# కల్తీ మాఫియాకు కళ్లెం

**ఎన్నికల నేపథ్యంలో నిఘా పెంచిన ఎక్సైజ్‌శాఖ**

**నకిలీ మద్యం పారకుండా ప్రత్యేక చర్యలు**

**నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు**

**అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**



హైదరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: ఓవైపు ఎన్నికలు ప్రచారాలు.. మరోవైపు మద్యం దుకాణాలకు పోటెత్తుతున్న మందుబాబులు.. ఈనేపథ్యంలో కల్తీ రాయుళ్లు రెచ్చిపోయే అవకాశం ఉందని గ్రహిం చిన ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. అనుమానం వచ్చిన ప్రతి బార్, వైన్స్‌లలో ఆకస్మిక దాడులు నిర్వహించి వాటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించేదుకు చర్యలు చేపట్టింది. బార్‌లోగానీ, వైన్స్‌లోగానీ కల్తీ మద్యం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు లైసెన్స్‌కూడా రద్దు చేసేందుకు వెనకాడేది లేదని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. మద్యం దుకాణాలకు మద్యం బాటిళ్ల నుండి చాకచక్యంగా మద్యాన్ని కొట్టేస్తున్న కల్తీరాయుళ్లు నగరంలో రోజు రోజుకూ పెరిగిపోతున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రేటర్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో ఇలాంటి అక్రమాలకు పాల్పడే కొందరిని ఎక్సైజ్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు.ఇలాంటి అక్ర మాలు నగరంలో గుట్టు చప్పుడు కాకుండా నగరంలో జరిగిపోతు న్నాయి. తక్కువ ధరకు లభించేవి కాకుండా, ప్రముఖ కంపెనీల బ్రాండ్‌లు,అధిక ధరలకు అమ్మేమద్యాన్నే కొందరు వ్యాపారులు టార్గెట్ ఏస్తున్నారు. దీని వల్ల ఖరీదైన మద్యం కొనుగోలు చేసిన వారు నష్టపోతున్నారు. ఇలాంటి అక్రమాలు నివారించడానికి ఎక్సైజ్ అధికారులు పెద్దఎత్తున తనిఖీలకు శ్రీకారం చుడుతునా న్నరు. కొందరు మద్యం వ్యాపారులు చాకచక్యంగా మూతలను తొలగించే వారిని తమ వద్ద పెట్టుకుం టున్నారు. కొంతనీళ్లు పోయడం, ఇతర బ్రాండ్లకు చెందిన మద్యాన్ని అందులో కలుపుతుండటం చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ప్రతిషాపును తనిఖీ చేస్తూ నమూనాలు సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన దానిని నారాయణగూడలోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపుతున్నారు. తాము సేకరించిన నమూనాల్లో నీటి శాతం, ఆల్కహాల్ శాతం నిర్ణీత ప్రమాణంలో ఉందా?లేదా? అన్నది ల్యాబ్‌లో చేసే పరీక్షల్లో తేలిపోతుందని అధికారులు తెలుపుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల ఏవ్యాపారి కూడా ప్రముఖ బ్రాండ్‌లనుండి మద్యాన్ని కొట్టేసే అవ కాశం ఉండ దని అధికా రులు చెబుతున్నారు. ఇటీవల కొందరు మద్యం వ్యాపా రులు ప్రముఖ బ్రాండ్‌లను సంబం ధించి ఎక్సైజ్ శాఖ వేసే సీల్ తొలగించకుండానే.. చాకచక్యంగా అందులోంచి కొంత మద్యాన్ని కొట్టేస్తున్నారన్న ప్రచారం జరుగు తోంది. ఇలాంటి ప్రచారా లపై అలర్ట్ అయిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు మద్యం షాపుల్లో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. అక్కడ పరిక్షిం చిన తర్వాత వచ్చే నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలుపుతున్నారు. ఒక వేళ సేకరించిన మద్యంలో నీటిశాతం అధికంగా ఉన్నట్లయితే సదరు షాపు యజమానిపై కేసు తీవ్రతను బట్టి లక్షరూపాయల నుండి రెండున్నర లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు పేర్కొంటున్నారు.

**ఇతర ప్రాంతాలనుంచి రాకుండా..**

ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుండి నగరంలోకి అక్రమ మద్యం ప్రవేశించడకుండా ఎక్సైజ్ ఇటీవల ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,శివార్లలలో గట్టి నిఘా ఉంచింది. అనుమానం వచ్చిన నేతల ఫాంహౌజ్‌లతో పాటు వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తుంది. పట్టుబడిన లిక్కర్‌ను ఎక్కడి నుండి తీసుకొచ్చారు.. ఎవరికోసం తీసుకొచ్చారన్న కోణంలో దర్యాప్తు చేపట్టి నివేదికను ఎన్నికల కమీషన్‌కు అందజేస్తుంది.దీంతో లిక్కర్ డంపింగ్ చేయాలన్నా.. రవాణా చేయాలన్నా తమపేరు బయటపడుతుందేమోనని నేతలు జంకుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని 11సర్కిళ్లలో కలిసి మొత్తం 183మద్యం దుకాణాలు, 225బార్లు ఉన్నాయి.మద్యం షాపులు, బార్లలో అక్కడక్కడ కల్తీ మద్యం దర్శనమిస్తుందన్న ఆరోపణలు ఇటీవల బాగా వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ప్రత్యేకంగా తనిఖీలకు చేపడుతున్నారు. ఆకస్మిక దాడులు నిర్వహించి కల్తీరాయుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. ఎన్నికల్లో కల్తీమద్యం పారకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలుపుతున్నారు.

## డబ్బు చుట్టూ తిరుగుతున్న ఎన్నికలు

ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక



**సమావేశంలో మాట్లాడుతున్న వేదిక ప్రతినిధులు**

హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త: దేశంలో ఎన్నికలు డబ్బు చుట్టూ తిరుగుతున్నాయని, ప్రజలు అమ్ముడు పోయినంత కాలం నాయకులు కొంటూనే ఉంటారని అందుకు ముందుగా ప్రజల్లో మార్పు రావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక వ్యవస్థాపక సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మామిడిసోమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీల ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు తమ వేదిక ముందు వచ్చిందన్నారు. సోషల్ మీడియా ఫోరం బాధ్యులు కరుణాకర్‌రెడ్డి,దేశాయ్ మాట్లాడుతూ రాజకీయపార్టీల ప్రలోభాలు, మేనిఫెస్టోల అమలు, అభ్యర్థుల నేత చరిత్రకు సంబంధించిన విషయాలను ప్రజలకు అందజేసే దిశలో తమ వేదిక పనిచేస్తుందన్నారు. పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను అతిక్రమించిచడంపై ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తూ, ప్రచారంపైనా నిఘా పెట్టాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమసంఘం అధ్యక్షులు ఆనంచిన్ని వెంకటేశ్వర్‌రావు అభిప్రాయపడ్డారు. ఓటును నోటుకు, మద్యానికి తాకట్టు పెట్టొద్దని ,భూకబ్జాకోరులు, అక్రమార్కులు, అవినీతిపరులకు ఓటు వేయొద్దని జాతీయ ఓబిసి సంక్షేమసంఘం అద్యక్షులు కె.కోటేశ్వర్‌రావు అన్నారు. ఐదేండ్లకు ఒకసారి వచ్చే ఆయుధం ఓటు, దానికి సక్రమంగా వినియోగించుకుని, సరైన నాయకుడిని ఎన్నుకోవాలని, పౌరసమాజంలో ఎటుచూసినా అవినీతి, అక్రమాలు విజృంభిస్తున్నట్లు వాటిని తక్షణం అరికట్టాలని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి స్పష్టం చేశారు. ఈకార్యక్రమలో అన్వర్‌పేటల్, ఆనందరావు, బి.హరినాథ్, వెంకటేశ్వర్లు,రవికుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగిలో పోలీసుల కవాతు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : డిసిపి



నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సోమవారం సాయంత్రం నార్సింగి పుర వీధులలో పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా ఎన్నికలలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యంను కాపాడుకోవాలన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి ప్రజలంతా నడుచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు చెక్‌పోస్టుల వద్ద చేస్తున్న వాహనాల తనిఖీకి సహకరించాలని సూచించారు. 50.వేల వరకు అనుమతి ఉంటుందని, అంతకంటే ఎక్కువ డబ్బు తీసుకెళితే... ఎక్కడి నుంచి ఆ డబ్బులు తెచ్చారో? ఎక్కడికి తీసుకెళ్తున్నా రో? రిసిప్టులు చూపించి తీసుకెళ్లాల్సి ఉంటుందని, రిసిప్టులు చూపించకపోతే ఆ డబ్బులు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. పాత నేరస్థులు ఎన్నికల సమయంలో ఏమైనా నేరాలకు పాల్పడితే జైలుకే పంపిస్తామని, పీడి యాక్టులు పెడ్తామని తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందరూ ఎన్నికలు ముగిసేంత వరకు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకొని, సమర్థులైన పాలకులను ఎన్నుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్.ఐ సుఖేందర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో పోలీసులు పాల్గొన్నారు.

## మొగల్‌పుర విద్యుత్ ఉద్యోగులను అభినందించిన టిఎస్ఇఆర్‌సి ఛైర్మన్

చార్మినార్,అక్టోబరు 30 ప్రభాతవార్త : విధి నిర్వాహణలో విద్యుత్ వినియోగదారులకు మంచి సేవలు అందించినందుకు టిఎస్ఇఆర్‌సి ఛైర్మన్,టిఎస్ఎస్‌పిడిసిఎల్ ఐపిసి డైరెక్టర్ స్వామిరెడ్డిలు మొగల్‌పుర ఎఇ జిఎల్ఎన్ రాజు,ఆర్టిజన్ సలీం రూహిలను శాలువ కప్పి సన్మానించారు.అక్టోబరు 19వ తేదీన విద్యుత్ బకాయిలు వసూళ్లు చేయటానికి వెళ్లిన సమయంలో పురానీహవేలి ప్రాంతానికి చెందిన ఓ వినియోగదారుడు మొగల్‌పుర విద్యుత్ సెక్షన్‌కు చెందిన ఆర్టిజన్ సలీం రూహిపై కత్తితో పొడిచే ప్రయత్నం చేశాడు.ఇది గమనించిన అదే సమయంయంలో అక్కడ విధి నిర్వాహణలో ఉన్న మొగల్‌పుర విద్యుత్ సెక్షన్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీరు జిఎల్ఎన్ రాజు వినియోగదారుడిని అడ్డుకున్నారు.కాగా ఈ సంఘటనలో అత్యంత వెళుకువగా వ్యవహరించినందుకు ఎఇ జిఎల్ఎన్ రాజు,ఆర్టిజన్ సలీం రుహిలను టిఎస్ఇఆర్‌సి ఛైర్మన్,టిఎస్ఎస్‌పిడిసిఎల్ ఐపిసి డైరెక్టర్ స్వామిరెడ్డిలు కలిసిశాలువ కప్పి అభినంధించారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ డిఇ లింగయ్య గౌడ్,చార్మినార్ ఎడిఇ విజయ్ కుమార్ కులకర్ణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్లపై కెటిఆర్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

**ఎల్ఐసి ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా**



**సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌చారి, మూర్తి తదితరులు**

హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త: ఎల్ఐసి ఏజెంట్లను కించపరిచే విధంగా కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని లైఫ్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ సెక్రటరీ జనరల్ ఎస్‌బి. శ్రీనివాస్‌చారి అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి ఎల్ఐసి ఏజెంట్లు కీలకపాత్ర పోషిస్తున్నారని అటువంటి వారిని కెటిఆర్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వెంటనే తనవ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆయనతోపాటు ఎంఎస్ మూర్తి, బి.శ్రీరామ్, బి.ఎన్.చారి, శ్రీనివాస్, సీతారాం, ఉదయ్‌భాను, వెంకట్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

## మాతృభాషను మరువద్దు: కె.వి.రమణాచారి



**పురస్కారాలను అందిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి**

చిక్కడపల్లి, జూన్ 30 ప్రభాతవార్త: మాతృభాషను మరువద్దని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. జీవిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీవీ యాంకర్స్‌కు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా కె.వి.రమణాచారి హాజరై వివిధ ప్రసారమాధ్యమాలకు చెందిన వారికి పురస్కారాలను అందించి గౌరవించారు. ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార క్రమంలో దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ సి.రామకృష్ణ, ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ, ఇండియన్ రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ డాక్టర్ లక్కరాజు నిర్మల, ఆదర్శఫౌండేషన్ స్థాపకుడు డాక్టర్ కుసుమ భోగరాజు, శ్రీవేదధార్మిక సంస్థ అధ్యక్షుడు కొండపాక కృష్ణమాచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పురస్కారాలు అం దుకున్న వారంతా ఎక్కువ మంది మహిళలే కావడం స్త్రీశక్తికి నిదర్శన మన్నారు. ఎంత ఒత్తిడి ఉన్నా కూడా వార్తలు చదివే సమయంలో వాటిని పక్కనబెట్టి చిరునవ్వుతో చదవడం అవసరమన్నారు. కార్యక్రమానికి ముందు ఎం.సాయిప్రియ(వైజాగ్) భరతనాట్యం, టిఎస్‌విఎస్.నివేదిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి.

## శేరిలింగంపల్లిలో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**కాంగ్రెస్‌గూటికి చేరిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దొంతి కార్తీక్‌గౌడ్.. కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్**

శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సబ్బండ వర్గాల మద్దతునుకూడగట్టుకుని గెలుపుదిశగా కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ ముందుకు అడుగులేస్తున్నారు. తన అభ్యర్థిత్వం ఖరారైన క్షణం నుంచి జగదీశ్వర్‌గౌడ్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. అసంతృప్తనేతలను ఒక పక్క కలుపుకునే ప్రయత్నం చేస్తునే మరోవైపు ఆయా పార్టీల నుంచి కాంగ్రెస్‌వైపుచూస్తున్న నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటూ శరవేగంగా దూసుకువెళుతున్నారు. ఇందులో భాగంగానే చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దొంతి కార్తీక్‌గౌడ్ కారు విడిచి హస్తం గూటికి చేరారు.ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కార్తీక్‌గౌడ్‌తో పాటు పలువురు యువనాయకులను కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చందానగర్,లింగంపల్లికి చెందిన పలువురు నాయకులు దొంతి సత్యనారాయణగౌడ్, రామచందర్‌రెడ్డి,పులిపాటి శ్రీనివాస్, సాయిరెడ్డి, దీపక్‌గౌడ్,నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌చారి, ఆనంద్‌గౌడ్, సతీశ్, మహేశ్,శ్రీపాల్,మహిళా నాయకులు సుధారాణి, రాధా,యూత్ సభ్యులు,యువనాయకులు,కార్యకర్తలు శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



**కాంగ్రెస్‌పార్టీలో చేరిన బీఆర్ఎస్ నేతలకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్‌గౌడ్**



**కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మెఘారాణి అగర్వాల్,బిజెపి నాయకులు రమేష్ యాదవ్**

## బిజెపి విజయం కోసం కృషి చేయాలి

చార్మినార్, అక్టోబరు 30 ప్రభాతవార్త : చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మెఘారాణి అగర్వాల్‌ను భాగ్యనగర్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు రమేష్ యాదవ్‌తో పాటు పలువురు సోమవారం కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ బిజెపి విజయం కోసం నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.సీనియర్ బిజెపి నాయకులు పవన్ మిశ్ర ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం



నూతన కార్యాలయాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభిస్తున్న బండి రమేష్

హైదరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ వద్ద ఎస్ఎంఆర్ వినయ్ క్యాపిటల్ బిల్డింగ్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జీ సత్యం శ్రీరంగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని అందరితో పంచుకొని కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న అధికార పార్టీ పైపైన రోడ్లు వేసి అభివృద్ధి చేశామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి సమస్యను పరిష్కరించి, ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్నటువంటి మహిళలు, మైనార్టీలు, ప్రతి ఒక్కరూ కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికి అందరం కలిసి కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. గతంలో కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తామని చెప్పి బంగారు తెలంగాణ అనేవి కేవలం కొన్ని కుటుంబాలకు మాత్రమే పరిమితమయ్యే విధంగా చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రతి ఇంటితో అనుబంధం

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**

మెట్టుగూడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజక వర్గంలో ప్రతి ఇంటితో తమకు అనుబంధం ఉంటుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెట్టుగూడ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలల్లో అభ్యర్థి విస్తృతంగా పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రచారాన్ని కొనసాగించారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాసురి సునీత రమేష్ తో కలిసి డీబీఆర్ గల్లీ, మైలార్ గడ్డ, ఎస్‌వీఎస్ గల్లీ, పాండవ బస్తీ, పార్థ బస్తీ, దూద్ బావి, చింత బావి, చికులకగూడ తధితర ప్రాంతాల్లో ఆయన ప్రచారంలో పాల్గొని ఓటర్లను కలుస్తూ వారిని పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్ రెడ్డి, యువనేతలు కిషోర్ గౌడ్, కిరణ్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, కంది నారాయణ, పెద్దన్న రాజేష్ గౌడ్, సునిల్ ముదిరాజ్, పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్, వంజరి సతీష్, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి, జింకల మల్లేష్, ఎర్ర శ్యామ్, నాగుతో పాటు పలువురు పాల్గొన్నారు.



స్థానికులకు పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న అభ్యర్థి పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ రాసూరి సునిత

## కట్ట మైసమ్మ ఆలయ భూమి పూజ



భూమి పూజ నిర్వహించిన శ్రవణ్ కుమార్

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్‌లో పురాతన కట్ట మైసమ్మ ఆలయం పునర్నిర్మానించేందుకు జరిపిన భూమి పూజలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ సోమవారం పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గొరిగె బీరప్ప, ఆలయ నిర్మాణ దాత సందెన బోయిన నారాయణ ముదిరాజ్, ఎఫ్‌సిఎస్ అధ్యక్షులు చిలుకూరు కృష్ణ, కార్యదర్శి మద్దూరు వీరేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చిలుకూరు యాదగిరి, ఎఫ్‌సిఎస్ కార్యవర్గ సభ్యులు, అర్కల లక్ష్మణ్, శంకర్, గోరిగె ఆంజనేయులు, చిలుకూరు నరసింహ, జక్కుల నర్సింగ్‌రావు, కీచుగారి శంకర్, శ్యామ్‌రావు, డి.శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాపూనగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: బాపూనగర్ అడ్వైజర్ శంకర్ ముదిరాజ్, సోమేష్ యాదవ్‌ల సూచనల మేరకు బాపూనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు అయిన సందర్భంగా ప్రెసిడెంట్ క్రిష్ణయాదవ్, జనరల్ సెక్రటరీ బాబురావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బెనర్జీ, కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే వివేకానంద, గౌరీశ్‌లను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, పోచయ్య, సత్యనారాయణరెడ్డి, మధు, సంతోష్, శ్రీనివాస్, సుబ్బయ్య, రాజారెడ్డి, రాజు, నరహరి, శివరామకృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డికి హఠావో- కాంగ్రెస్ పార్టీకి బచావో

సైఫాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: నాడు ఓటుకు నోటు-నేడు ఎమ్మెల్యే సీట్లకు కోట్లు, ఎమ్మెల్యే టిక్కెట్లు కోట్ల రూపాయలకు అమ్ముకుంటూ పార్టీని నాశనం చేస్తున్న టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హఠావో-కాంగ్రెస్ పార్టీకి బచావో అనే నినాదంతో అనేక మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సోమవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బహిష్కృత టి-పిసిసి కార్యదర్శి డా.కురవ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి 65 అసెంబ్లీ నియోజవర్గాల సీట్లను 600 కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని, వందలాది ఎకరాల భూమిని రాయించుకున్నారని ఆరోపించారు. తక్షణమే ఆయన్ని పార్టీ నుంచి బహిష్కరించాలని పార్టీ అధిష్టాన వర్గాన్ని కోరారు. కాంగ్రెస్ పార్ట సభ్యత్వం లేనివారికి, వ్యాపారస్తులకు, డబ్బులు ఉన్నవారికి రేవంత్‌రెడ్డి సీట్లు అమ్ముకున్నారని ఇందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## నేడు ఓయూ స్నాతకోత్సవ వేడుక

**హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందరాజన్**

తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీలో నేడు జరుగనున్న స్నాతకోత్సవ వేడుకలను ఓ.యూ అధికారులు అంతా సిద్ధం చేశారు. పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాలు 979 మంది అభ్యర్థులకు అందుకోనున్నారు. అందులో 57 బంగారు పతకాలను అందజేయనున్నారు. మహిళలు 371,పురుషులు 608 మందికి డాక్టరేట్లు అందజేయనున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఏడాదిలోనే 1325 పీహెచ్‌డీ పూర్తి చేయగా అందులో 979 కాన్వకేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, అధ్యాపకులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు అఫీసర్లతో పాటు ఎమ్మెల్యేలు సీతక్క, బాల్కసుమన్, జి.బాల్‌రాజుతో పాటు పలువురు డాక్టరేట్ పట్టాలను అందుకోనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఒయూ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి అమెరికాకు చెందిన అడోబీ కంపెనీ సీఈఓ పద్మశ్రీ శంతన్ నారాయణ్‌తో విధ్యార్థులకు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు.

## ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ హెడ్‌గా సంపత్ తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త: ఐదుల క్షలకు పైగా ఉన్నరెస్టారెంట్లు, క్యూఎస్ఆర్‌లు, బార్లు, క్లౌడ్‌కిచెన్‌లు, క్యాటరింగ్‌కు ప్రాతినిత్యం వహిస్తున్న ఇండియన్ రెస్టారెంట్ ఇండస్ట్రీ వాయిస్ అయిన "నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా "(ఎన్ఆర్ఏఐ) హైదరాబాద్ ఛాప్టర్ హెడ్‌గా సంపత్ తుమ్మల ఎన్నికయ్యారు. ఈసందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పేరుప్రకటించారు. ఈసందర్భంగా సేజ్‌పార్క్‌కేఫ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి 120మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా అల్లరి నరేష్, అడివి శేషు, నందినీరెడ్డి, రవితేజ రావూరి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా సంపత్ తుమ్మల మాట్లాడుతూ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమకు ప్రాతినిత్యం వహించడం ఆనందంగా ఉందన్నారు.

## గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త : ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ అశోక్‌నగర్‌లో అక్రమంగా తరలిస్తున్న 12 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి జిల్లా ఎక్సైజ్ అధికారి డి.అరుణ్‌కుమార్, ఈఎస్ బి.ముకుందరెడ్డి, ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.చంద్రశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ అశోక్‌నగర్‌ల. రైల్వే ట్రాక్ పక్కన అనుమానాస్పద వస్తువులు పడి ఉండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## అభివృద్ధిని కొనసాగిద్దాం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**

ధర్నాచౌక్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని కొనసాగిద్దామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని మల్లయ్య హోటల్ చౌరస్తాలో సాయి సమాధి ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుండి ముషీరాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, ముషీరాబాద్‌ను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని స్పష్టం చేశారు. నవంబర్ 30వ తేదీ ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు ఓటువేసి మరింత బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

## సామాజిక సేవల్లో ముందుకు రావడం అభినందనీయం : కొంతం దీపిక



లయన్స్‌క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త: రాజకీయ పార్టీలకు అతీతంగా లయన్స్‌క్లబ్‌లు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మోండా డివిజన్ కారో ్పరేటర్ కొంతం దీపిక తెలిపారు. లయన్స్‌క్లబ్ సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి జానకి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు ఫిజియోథెరపి ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

## స్ట్రోక్ లక్షణాలపై అవగాహన అవసరం

హైదరాబాద్, అక్టోబర్ 30,ప్రభాతవార్త: మానవ శరీరంలో బ్రెయిన్,హార్ట్ స్ట్రోక్ లక్షణాలపై అవగాహన ఉంటే ప్రాణాలు త్వరగా రక్షించుకోవచ్చునని పలువురు వైద్యులు తెలిపారు. స్ట్రోక్ పేషెంట్లను గోల్డెన్ అవర్‌లోగా హాస్పిటల్‌కు తీసుకెళ్తే అవసమైన చికిత్స అందించవచ్చునని పేర్కొన్నారు. వరల్డ్‌స్ట్రోక్‌డే సందర్భంగా సోమవారం బంజారాహిల్స్‌లోని విరించి అవరణలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా ప్రముఖ న్యూరాలజిస్ట్ అథీకర్ రెహమాన్,సిఈఓ రవిశంకర్, వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్ట్రోక్ లక్షణాలపై కుటుంబసభ్యులందరితో పాటూ ప్రజలల్లో అవగాహన ఉన్నప్పుడే పేషెంట్లను వెంటనే గుర్తించవచ్చునన్నారు. ముఖ్యంగా తమ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా ముఖం,చేయి,కాలులో తిమ్మిరెక్కడం, రెండుకాళ్ల లేదా ఒక కంటితో చూడటానికి ఇబ్బందులు,మాట్లాడటంతో ఇబ్బంది, శరీరం బాలెన్స్ కోల్పోవడం, కళ్లుతరగడం వంటి లక్షణాలు కనబడితే అవిస్ట్రోక్ లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఇలాంటి లక్షణాలు తమచుట్టూ ఉన్నవారిలో కనబడితే వెంటనే హాస్పిటల్‌కు తరలించి వారి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి తలసాని



ముస్లిం మైనార్టీలతో సమావేశమైన మంత్రి శ్రీనివాస్‌యాదవ్

కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బిఆర్ ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గానికి సంబంధించిన ముస్లింలతో ఏర్పాటు చేసిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు తాము ససంపూర్ణ మద్ధతు తెలుపుతున్నామని ముక్త కంఠంతో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే నియోజకవర్గం పరిధి లోని పలు ప్రాంతాల్లో కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధిలో సనత్ నగర్ అసెంబ్లీని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. అదే విధంగా మసీద్‌లు, ఖబ్రస్తాన్‌ల అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, ముసస్లిం మైనార్టీ నేతలు ఖలీల్, నోమాన్, అఖీల్, ఫహీం, రజాక్, అబ్బాస్,అరీఫ్, ఖరీమ్, ఫాజిల్, అసిన్, జావిద్, గౌసస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్‌కాలనీలో కార్పోరేటర్ ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కార్పోరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరికెపూడి గాంధీని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్ళి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేస్1, సాయినగర్ ఈస్ట్, సాయినగర్ వెస్ట్, ఆదిత్య నగర్ కాలనీలో ఇంటింటికి వెళ్ళి కాలనీ వాసులను అప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలిచి బిఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, డివిజన్ ఆధ్యక్షులు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, కాశినాథ్‌యాదవ్, రాజేష్ చంద్ర, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, బి.వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్, ప్రకాష్, గోపిచారి, శేఖర్, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

## ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొచ్చే నాయకులను తిరస్కరించండి

**ఎమ్మెల్యే వివేకానంద**



పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొచ్చే నాయకులను తిరస్కరించాలని, అనునిత్యం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి చేసే నాయకుడుని గెలిపించాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. ఆదివారం రాత్రి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 22వ డివిజన్ ఎన్నారై కాలనీలోని సాయికుమార్ హబ్ అపార్ట్‌మెంట్‌లో ఎమ్మెల్యే వివేకానంద్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడం కోసమే కాకుండా తమ స్వార్థ రాజకీయాల కోసం ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను తిరస్కరించి, ఆపదకాలంలో ప్రజలకు మేమున్నామంటూ అభయమిచ్చే నాయకులకు విజయాన్ని చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పోరేటర్లు మాధవి పైడి, రాఘవేంద్రరావు, విజయలక్ష్మీ, సుబ్బారావు, సురేష్‌రెడ్డి, వెంకటేష్, గాజుల సుజాత, ఆగంరాజు ముదిరాజ్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, గంగెయ్యల శ్రీనివాస్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు జ్యోతి సతీష్, సయ్యద్ సలీం, తలారి వీరేష్, 22వ డివిజన్ అధ్యక్షులు శ్రీకర్‌గుప్త, నిజాంపేట్ బిఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

## బిజెపివి రాజకీయ ఎత్తుగడలు

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామంటూ బీజేపీ ప్రకటించటం కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమేనని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కవాడిగూడలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీకి నిజంగా బీసీల మీద ప్రేమ ఉంటే ఇప్పటి వరకు ఓబీసీ మంత్రిత్వశాఖను ఎందుకు ఏర్పాటుచేయలేదని, జాతీయ ఓబీసీ కార్పోరేషన్ ను ఎందుకు నిర్లక్ష్యం చేశారని, ప్రత్యేక బడ్జెట్‌ను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. తెలంగాణ అధ్యక్ష పదవి నుండి ఒక బీసీని తొలగించిన బీజేపీ పార్టీ ఇప్పుడు బీసీ ముఖ్యమంత్రి అంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. **కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తిదాడి అమానుషం:** ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయటం అమానుషమైన చర్య అని, దీనిని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ నాయకులుగా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నో ఎన్నికలు జరిగాయి కానీ ఇటువంటి హింసాత్మక ఘటనలు ఎవరూ ప్రోత్సహించిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. శాంతియుతంగా భావస్వేచ్ఛతో ఎన్నికలలో పాల్గొనాలి కానీ, కత్తి పోట్లు, హింసాప్రవృత్తికి ప్రజాస్వామ్యంలో చోటు ఉండదని అన్నారు.

## రంగారెడ్డి నగర్ డివిజన్ నుండి బిజెపిలోకి చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, అక్టోబర్ 30, ప్రభాతవార్త : రంగారెడ్డి నగర్ 127 డివిజన్ పరిధిలోని గుబురుగుట్ట, సంజయ్‌గాంధీ నగర్‌ల నుండి సోమవారం సుమారు 100మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు గాజులరామారంలోని బిజెపి అసెంబ్లీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో బిజెపిలో చేరారు. వారికి శ్రీశైలంగౌడ్ కమలం కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌తోనే కుత్బుల్లాపూర్ అభివృద్ధి సాధ్యమని భావించి బిజెపిలో చేరుతున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ పాలనలో విసిగిపోయామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. రాజేష్, రాజు, బాలస్వామి, సుదర్శన్, దశరథ్, ఉమా, బేబిరాణి, దశరథ్‌సింగ్, అనసూయ, నర్సమ్మ, బాలమణి, ఉషా, సుఖేష్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బండారు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్ ముదిరాజ్, నాయకులు సుదీర్‌కుమార్, క్రాంతి, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్**

ధర్నాచౌక్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన ముషీరాబాద్ డివిజన్‌లోని శివాలయం నుండి కృష్ణాకాలనీ, పఠాన్‌బస్తీ, గంగపుత్ర సంఘం, మోహన్ననగర్, కృష్ణా నగర్ ప్రాంతాలలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందుకు వచ్చిందని, ఈసారి తెలంగాణ ప్రజలు తప్పకుండా కాంగ్రెస్‌ను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ కల్పనాయాదవ్, నాయకులు పెండం శ్రీనివాస్‌యాదవ్, మేడి సురేష్, నాగభూషణంగౌడ్, జనిగ శ్రీనివాస్‌యాదవ్, కవిత, కృష్ణవేణి, లింగం గుప్తా, మురళీ మోహన్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## కాచిగూడ డివిజన్‌లో ఎమ్మెల్యే కాలేరు పాదయాత్ర



ఎమ్మెల్యే కాలేరుకు మంగళహారతి పడుతున్న మహిళ

హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం కాచిగూడ డివిజన్‌లోని భద్రుకా కాలేజీలైన్, రహ్మత్‌నగర్, ఎస్సీఎస్ హాస్పటల్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు కాలేరుకు మంగళ హారతులు పట్టారు. అభివృద్ధి, సంక్షమానికి మారుపేరుగా సిఎం కెసిఆర్ పాలనలో తమ ప్రాంతాలలోని అన్ని సమస్యలను తీరుస్తున్న ఎమ్మెల్యే కాలేరుకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ పాదయాత్రలో మహిళలు, యువకులు, వృద్ధులు పాల్గొని తమ ఓటు కారుగుర్తుకేనని, మళ్ళీ కాలేరే తమకు ఎమ్మెల్యేగా రావాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి, అక్టోబర్ 30 ప్రభాతవార్త: శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు సంపూర్ణమద్దతు పలుకుతూ వారిని గెలిపించాలని ఆయన సతిమణి హాఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు.ప్రతి ఇంటి గడపగడపకు వెళ్లి హస్తం గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను అందజేస్తూ అందరిలోనూ జోష్ నింపుతున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తూ నిరంతరం జనంకోసం శ్రమించే జగదీశ్వర్‌గౌడ్‌కు శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని సబ్బండ వర్గాలు మద్దతు ప్రకటిస్తూ ముక్తకంఠంతో గెలిపిస్తామని ప్రతి ఒక్కరూ తెలియజేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోనికి వస్తే ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్ ముదిరాజ్,రవికుమార్,రాజు ముదిరాజ్, యుగేందర్, అంజయ్య,రాధాకృష్ణగౌడ్,భిక్షపతి, దేవరాజ్,ప్రవీణ్ కుమార్, కందిచిన్న,అనిల్,సాయి,కిరన్,వంశీ,పాండురాజు,మహేశ్,నందు,మాణిక్‌రాజు,సత్యం,నితిన్ గౌడ్, గోపాల్, భాస్కర్, పకాశ్,నిరంజన్,బీమమ్మ,సుమలత,శిరిషా తదితరులు పాల్గొన్నారు.

## మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే: ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ



బీఆర్ఎస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్న పలువురు నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీ

శేరిలింగంపల్లి,అక్టోబర్ 30 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికల జోరు పెరుగుతోంది. కాంగ్రెస్,బీజేపీ పార్టీలలోని అసంతృప్త నాయకులు, కార్యకర్తలు కారెక్కుతున్నారు.చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన కాంగ్రెస్‌పార్టీ ,బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, యువకులు బీఆర్ఎస్ పార్టీ నేత ఉరిటి వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు వినయ్, మహేశ్,నవీన్,ప్రదీప్,మనోహర్,రాజు,సాయికుమార్;చందుగౌడ్, ప్రసాద్,ప్రశాంత్,నాగరాజు, కృష్ణ,మణికంఠ,మనోజ్‌లు గులాబీ కండువా కప్పుకున్నారు. అదే విధంగా శివాజీనగర్‌కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నేత యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో కూడా పలువరు బీఆర్ఎస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ప్రవీణ్,ప్రసాద్,రవీందర్‌రెడ్డి,నరేందర్ బల్లా,సందీప్‌రెడ్డి, యశ్వంత్,బీఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్_లు,వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో 2లక్షల 32వేల స్వాధీనం

నేరెడ్‌మెట్ అక్టోబర్30 ప్రభాతవార్త: ఎన్నికల సమయంలో సరైన పత్రాలు లేకుండా నగదును సరఫరా చేయకూడదని నేరెడ్‌మెట్ సీఐ శివకుమార్ పేర్కొన్నారు. నేరెడ్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్.కె పురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాలు తనీఖీలు చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి వద్ద నుండి 2లక్షల 32వేల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆ నగదును ట్రెజరీ విభాగానికి తరలిస్తామని తెలిపారు.

## ప్రకాశ్‌గౌడ్‌తోనే రాజేంద్రనగర్ అభివృద్ధి చెందింది

**మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్**

నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం హాట్రిక్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తోనే రాజధాని హైదరాబాద్ మహానగరానికి ధీటుగా అభివృద్ధి చెందిందని బండ్లగూడ జాగీర్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం కార్పోరేషన్ పరిధిలోని 3,4,16.వ,వార్డులలో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌కు ఓట్లు వేయాలని జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తును చూపించి, వచ్చే ఎన్నికల్లో మరోమారు ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమాభివృద్ధి ఫలాలే బిఆర్ఎస్‌కు విజయాన్ని అందిస్తాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, కేసీఆర్‌కిట్లు, ఇంటింటికి సురక్షితమైన మంచినీటి సరఫరా, కోటిన్నర ఎకరాలకు సాగునీరు, రైతు బంధు, రైతు భీమా, ధాన్యానికి గిట్టుబాటు ధర అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని పరుగులు పెట్టించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కడితేనే మన నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్, కార్పోరేటర్లు చంద్రశేఖర్, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మావతి పాపయ్య యాదవ్, సాగర్‌గౌడ్, అస్లాం, సీనియర్ నేతలు గోపాల్, నాగరాజు, పాండు, ఖాజా, అంతారం నరేష్, రాజు, రాంప్రసాద్, రాము, మల్లేష్ యాదవ్, సుందర్‌గౌడ్, సంపత్, రాజు, నర్సింగ్‌రావ్, సాధిక్, సదానంద్ గౌడ్, కుమార్ యాదవ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని 3,4.వార్డులో ప్రకాశ్‌గౌడ్‌కు ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

# ఆరు గ్యారెంటీలపై ప్రచారం

ఖైరతాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: ఎక్కడైన అన్ని రంగాలలో, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఇస్తున్న గ్యారంటీల కరపత్రాలను ఖైరతాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి ప్రజలకు ఇంటింటా వివరించారు. ప్రచారంలో భాగంగా బస్తీల, కాలనీలలో ఆమె సుడిగాలి పర్యటనలు చేశారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, నేడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు తెలంగాణ ప్రజల కోసం సుస్థిర పాలన అందించాలని పరితపి స్తున్నారని విజయారెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడమే తమ సిద్ధాంతం, లక్ష్యమంటున్నారు. రాబో యే రోజుల్లో అంతటా అన్ని వర్గాల ప్రజలకు చేయూతనివ్వా లన్న దృక్పథంతో ఉన్నామని సూచించారు. ఈ కార్యక్రమంలో బస్తీల, కాలనీల పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, మహిళలు ప్రభృతులు పాల్గొన్నారు. అంతకుముందు కొందరు విజయారెడ్డికి ఘన స్వాగతం పలికారు.

# మజ్లిస్‌ను ఓడిస్తేనే కార్వాన్ అభివృద్ధి

**ఠాకూర్ అమర్‌సింగ్**



హీరానగర్‌లో పర్యటించిన ఠాకూర్ అమర్‌సింగ్

మెహిదీపట్నం, అక్టోబర్ 30, ప్రభాతవార్త : మజ్లిస్ పార్టీని ఓడిస్తేనే కార్వాన్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని బిజెపి కార్వాన్ సెగ్మెంట్ అభ్యర్థి ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కార్వాన్‌లో బిజెపి గెలుపొందాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కార్వాన్ డివిజన్ పరిధిలోని హీరానగర్, అల్లూరి సీతారామరాజునగర్, సాయినగర్, న్యూసాయినగర్‌లలో పర్యటించి కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని స్థానికులను అభ్యర్థించారు. నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులు ఉన్నా లేనట్టే అన్నారు. అధికారులు మజ్లిస్ పార్టీ కనుసన్నుల్లో పనిచేస్తూ సరియైనది కదన్నారు. ఆయన వెంట నాయకులు సుధాకర్‌యాదవ్, డిజ్వర్‌సింగ్, సునీల్‌యాదవ్ స్థానికులు ఉన్నారు.

# రోగుల సహాయకులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేనీ

గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 30 ప్రభాతవార్త: టిఎన్‌జిఓ యూనియన్, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఎం.ఎన్.జె క్యాన్సర్, నీలోఫర్ ఆసుపత్రి వద్ద రోగులకు సహాయకులకు డాక్టర్, సేవరత్నా, టి.ఎన్.జి.ఓ అధ్యక్షులు ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహకఅధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కుర్రాడు శ్రీనివాస్, వైధిక్ శాస్త్రి, కేంద్ర సంఘం నాయకు లు పర్వతాలు, క్యాన్సర్ ఆసుపత్రి సిబ్బంది బి.శివ కుమార్, చంద్రశేఖర్, అబ్దుల్ ముజీబ్, పి.ఆర్.ఓ మహమ్మద్ వహీద్, ముస్తాఫా షరీఫ్, హాబీబ్ చావుష్ తదితరులు పాల్గొ న్నారు. పేదవారికి ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నారు. మున్ముందు మరిన్ని సేవలు చేయనున్నట్లు తెలిపారు.

# క్రీడాకారులతో కార్పొరేటర్ శంకర్‌యాదవ్



బేగంబజార్, అక్టోబర్ 30ప్రభాతవార్త:గోవాలో జరుగనున్న37వ జాతీయ క్రీడా పోటిలల్లో పాల్గొనున్న క్రీడాకారులకు బేగంబజార్ డివిజన్ బిజెపి కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్, తెలంగాణ స్కయ్ మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షులు గొంటి శంకర్ యాదవ్ ట్రాక్, సూట్ కిట్స్‌లను అందచేశారు. తెలంగాణ స్టేట్ సెలెక్టెడ్ అయిన క్రీడాకారులు మహేష్‌యాదవ్, జి.యశ్వంత్, శివయ్య, ఆనంద్, రజని, ఝాన్సీ, వర్షారెడ్డి, జూనైనాలతోపాటు డి.అంజనేయులు, టెక్నికల్ ఆఫీషియల్, కోచ్ పి.అశోక్, సలహా దారులు గోవింద్ రాజుమహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో బిజెపి అభ్యర్ధిని గెలిపించాలి : కన్నాభిరామ్



సికింద్రాబాద్‌లో బిజెపి అభ్యర్థిని గెలిపించాలని తుకారాంగేట్‌లో ప్రచారం చేస్తున్న బిజెపి నేతలు

అడ్డగుట్ట, అక్టోబర్ 30 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సి.హెచ్.కన్నా భిరామ్ ఆధ్వర్యంలో సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లోని కొండా రెడ్డి నగర్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ అసెంబ్లీకి బిజెపి ఎవరికి టికెట్ కేటాయించిన ఆ అభ్యర్థికే ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ బిజెపి నాయకులు కె. మోహన్ రావ్, వై.వీరేశం, గణేష్, స్వామి, జ్ఞానేశ్వర్ రావ్, బి.శ్రీనివాస్, మురళీ, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ సంగీత నృత్యరీతులు భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలు

నాంపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త : శాస్త్రీయ సంగీతం, నృత్యరీతులు భారతీయ సంస్కృతిలో భాగాలని, అందులో తెలుగువారి సొంతమైన కూచిపూడి నృత్యం, అభినయ విద్యలోని మెళకువలు, సంప్రదాయ శాస్త్రీయ పద్ధతులను యువకళాకారులకు అందించే లక్ష్యంతో శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిల యంలో ప్రముఖ నృత్యగురువు కళాకృష్ణ నేతృత్వంలో నాయికాభినయం అనే అంశంపై కార్యశాలను నిర్వహించడం హర్షదాయకమన్న ప్రముఖ విద్యావేత్త, పండితుడు, టిటిడి శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధిని కళాశాల పూర్వ ప్రిన్సివాల్ డా. నందూరి విద్యారణ్యస్వామి గురు కళాకృష్ణను ఘనంగా సత్కరించి కూచిపూడి నృత్యం, అభినయ విద్యలోని మెళకువలు, సంప్రదాయ శాస్త్రీయ పద్ధతులను యువకళాకారులకు అందించే లక్ష్యంతో కార్యశాలను ఏర్పాటు చేసినందుకు ప్రశంసించారు.

# గజ్వేల్ నుంచి సిఎం కెసిఆర్‌పైన పోటి

**సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రకటన**

సైఫాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం తాను ముఖ్యమంత్రి కెసిఆర్‌పై గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటి చేస్తున్నానని తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారిణి, సోషలిస్టు పార్టీ (ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోషలిస్టు పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసిన పోటి చేసే అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే ఏడాదికి 20 వేల రూపాయలు రైతు బంధు పథకం కింద అందిస్తామని, ప్రభుత్వ ఉద్యోగుల వయసు 61 సంవత్సరాల నుంచి 58 సంవత్స రాలకు కుదించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, రాష్ట్రంలో మద్యపాన నియంత్రణకు పెద్ద ఎత్తున కృషి చేస్తామని, ప్రైవేటు విద్యను నిషేదిస్తామని, ఎస్సీ, ఎస్టీ, బిసిలకు అన్ని రంగాలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామన్నారు. ఆమె తొలి జాబితాలో 14 మంది పేర్లను ప్రకటించారు. త్వరలో మిగతా అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. గజ్వేల్ నుంచి ఆర్.సుభద్రరెడ్డి, గోషామహల్ నుంచి పి.వి.రమేష్ బాబు, రాజేంద్రనగర్ నుంచి పి.లక్ష్మణ్, అంబర్‌పేట నుంచి గోపాల్ పతంగేయ్, మలక్‌పేట నుంచి రాజాగౌడ్, సనత్‌నగర్ నుంచి షహజాది, ఇబ్రహీంపట్నం నుంచి ఆర్.ధర్మానాయక్, దేవరకొండ నుంచి కె.లక్ష్మినాయక్, నాగార్జునసాగర్ నుంచి శ్రీనివాస్, మిర్యాలగూడ నుంచి ఎం.సైదయ్య పోటి చేస్తారని వివరించారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో బ్రాహ్మణ అభ్యర్థులను గెలిపించుకోవాలి



సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక కార్యనిర్వాహకులు

నాంపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే బ్రాహ్మణ అభ్యర్థులను కలిసికట్టుగా సమర్ధించి గెలిపించుకోవాల్సిన బాధ్యత బ్రాహ్మణులం దరిపైనా ఉందని బ్రాహ్మణ సంక్షేమ వేదిక పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా వేదిక ప్రధాన కార్యదర్శి అచ్చుత్ రామశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ వేదిక ద్వారా 8 నియోజకవర్గాలలో బ్రాహ్మణులు పోటీచేస్తున్నారని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించి వీరికి అన్నివిధాల పూర్తి సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వ్యవస్థాపక కార్యదర్శి బాలశ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ రాజకీయపార్టీలు బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగకుండా తగినన్ని సీట్లు కేటాయించకుండా కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే వాడుకొం టున్నారని, అలాంటి వారికి గుణపాఠం నేర్పేందుకు పోటీకి నిలబడ్డ తమ 8మంది బ్రాహ్మణులకు సంపూర్ణ మద్దతునివ్వాలని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి నేరెళ్ల మల్లికార్జున రావు, ఖైరతాబాద్ పావనిశర్మ, కంటోన్మెంట్ సత్యనారాయణ, కూకట్‌పల్లి చొప్పకట్ల రాము, సికిందరాబాద్ అచ్చుత్‌రామశర్మ, వరంగల్ పెండెం రాఘవరావు, పాలేరు శ్రీనివాసరావు, ఖమ్మం వెంకటరమణ పోటీలో ఉన్నట్లు బాలశ్రీనివాస్ వివరించారు.

# అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు

యాకుత్‌పుర, అక్టోబరు 30 ప్రభాతవార్త : పాతబస్తీ గౌలిపుర డివిజన్ పరిధిలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమ వారం పూజలు, అన్న దాన ప్రసాదం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుం దర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం లోని ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని కోరారు. క్రిష్ణ గురుస్వామి, ప్రశాంత్, సభ్యులు సాయి బాబా, యశ్వంత్, దేవి, నర్సింహాగౌడ్, సంతోష్, జమ్మిచెట్టు రాజుతో పాటు పలువురు పూజ, అన్న దాన ప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎన్ని గ్యారంటీలు ఇచ్చినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు

**పాదయాత్రతో ప్రచారాన్ని ప్రారంభించిన ఖైరతాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్**



ప్రచారంలో పాల్గొన్న దానం నాగేందర్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ఎన్ని గ్యారెంటీలు ఇచ్చినా ప్రజలు నమ్మరని ఖైరతాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ అడ్డుపడుతున్నదని దానం దుయ్యబట్టారు. హిమాయత్ నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేసిన అనంతరం దానం నాగేందర్ పాదయాత్రతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ ప్రజల గుండెల్లో కెసిఆర్ ఉన్నారన్నారు. విజయం సాధించి ముఖ్యమంత్రిగా కెసిఆర్ పగ్గాలు చేపట్టడం తథ్యమని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో తాను భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి నిరోధకులు కాంగ్రెస్ పార్టీ అని, తెలంగాణలో డీకె శివకుమార్ పప్పులు ఉడకవని దానం అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రంలో 24గంటలు కరెంట్ ఇస్తుంటే డీకె శివకుమార్ కర్ణాటకలో ఐదు గంటల కరెంట్ ఇస్తున్నాననడం ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పనితీరుకు నిదర్శనమన్నారు. సంక్షేమ పథకాలకు అడ్డు తగలడమే కాంగ్రెస్ నైజమైతే, ఆ సంక్షేమ పథకాలను కొనసాగించడమే ముఖ్యమంత్రి కెసిఆర్ నిరంతర ప్రక్రియ అని దానం అన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో జరిగిన ఈ పాదయాత్రలో డివిజన్ అధ్యక్షుడు యాదగిరి ఉపాధ్యక్షుడు కొలుకుల శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ సంతోష్‌గుప్త, రామ్‌లాల్, సుదర్శ న్, పలువురు నాయకులతో పాట వందలాదిగా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలే గెలిపిస్తాయి

చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం లో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని స్థానిక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో జరిగిన సమావేశంలో స్థానిక బస్తీకి చెందిన విశాల్ బృందంతో పాటు యువకులు, మహిళలు బిఆర్ఎస్ పార్టీలో యువనేత ముఠాజైసింహా, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ సమక్షంలో చేరారు.

# కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

పేట్ బషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షమంలో నియోజకవర్గంలోని పలు డివిజన్‌లకు చెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలోని 132 డివిజన్ వెన్నెలగడ్డకి చెందిన 100మంది, 127 డివిజన్ గాంధీ నగర్‌కి చెందిన 200మంది, 125 డివిజన్ చంద్రగిరి నగర్‌కు చెందిన 100మంది, 126 డివిజన్ శ్రీనివాస నగర్‌కి చెందిన 100మంది కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న 6 గ్యారెంటీలతో పాఉట ఇతర సంక్షేమ పథకాలకు ఆకర్షతులు అవుతున్నవారంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

# అసెంబ్లీ సీట్లులో గౌడ సామాజిక వర్గానికి అన్యాయం

**మిగిలిన స్థానాల్లోనైనా న్యాయం చేయాలి: గోపా**



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బండి సాయన్నగౌడ్

సైఫాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికల్లో గౌడ సామాజిక వర్గానికి జనాభా ప్రాతిపదికన 30 సీట్లు రావాల్సి ఉండగా అన్ని రాజకీయ పార్టీలు కేవలం పది సీట్లు కేటాయించి చేతులు దులుపుకున్నాయని గౌడ్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఆరోపించింది. ఇప్పటికైనా మిగిలిన సీట్లలో తగినన్ని కేటాయించి న్యాయం చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్దెల రమేష్‌బాబుగౌడ్, డాక్టర్ బండి సాయన్నగౌడ్ తదితరులు మాట్లాడుతూ గౌడ కులస్తులకు బిఆర్ఎస్ పార్టీ 4 సీట్లు, బిజెపి, 3 సీట్లు, కాంగ్రెస్ పార్టీ 3 సీట్లు కేటాయించి అన్యాయం చేశాయని, వచ్చే జాబితాలోనన్న తగినన్ని సీట్లు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. గౌడ సామాజిక వర్గం ఓట్లు ప్రతి నియోజకవర్గంలో 50 వేల నుంచి 75 వేల మధ్యలో ఉన్నారని చెప్పారు. తమ అసోసియేషన్ చాలా ప్రతి ష్టాత్మకమైనదని, రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల మంది సభ్యులతో 33 జిల్లాలో యూనిట్స్ కలిగి గౌడ వర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి పాటుపడుతున్నదన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మొగిలి రఘునాథ్‌గౌడ్, మొగిలి వెంకటరాజం గౌడ్, ప్రసాద్, సైదులుగౌడ్, కురయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్రులు రాజకీయంగా ఎదగాలి



దేశబోయిన రఘు ను సన్మానం చేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త: గంగపుత్రులకు సరైన గుర్తింపు లేక వెనుకబడి పోతున్నారని, గంగపుత్రులు అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఉందని తెలంగాణ లెక్చరర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి పుల్లయ్య అన్నారు. బౌద్ధనగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వారాసిగూడలోని గంగపుత్ర సొసైటీ భవన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసుకొని పట్టా పొందిన డాక్టర్‌లు, ప్రముఖ న్యాయవాది దేశబోయిన్ రఘు, అక్కపల్లి కిరణ్, కూర మల్లికార్జున్‌లకు సన్మాన కార్యాక్రమం జరిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ హక్కులను సాధించుకోవడంలో గంగపుత్రులు వెనుకబడి ఉన్నారని, ఇందుకోసం పోరాటం చేయడమే ప్రథమ లక్ష్యంగా పెట్టుకో వాలని అన్నారు. ఈ కార్యాక్రమంలో కైరంకొండ సత్యనారాయణ, కంటె హరినాథ్, కైరంకొండ యాదగిరి, పాక మూర్తి, కంది నారాయణ, పూస రాజ్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, సల్లూరు మల్లేష్, ఎర్రబోయిన మల్లేష్, శ్యామ్ పాల్గొన్నారు.

# పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని దోభీఘాట్‌లో పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి అయినట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ వివరించారు. దోభీఘాట్ బస్తీవాసుల ఆహ్వానం మేరకు సోమవారం ఆ ప్రాంతాన్ని బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌తో కలిసి సందర్శిం చారు. స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్‌గా తనను గెలిపించిన నాటి నుంచి అన్ని ప్రాంతాలలో అభివృద్ధి చేపడుతూ ముందుకు సాగుతున్నామని, నూతనంగా ప్రతిపా దనలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం. ఉమేష్; నాయకులు ఆకుల సురేందర్, లక్ష్మణ్ యాదవ్, దోనేటి సత్యం, ఆనంద్‌రావు, ప్రశాంత్, సుధాకర్, స్థానిక బస్తీవాసులు నగేష్, లక్ష్మీ, వనమ్మ, లలిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని 119 స్థానాల్లో పోటీ చేస్తాం

**జైస్వరాజ్ పార్టీ అధ్యక్షులు కాసాని శ్రీనివాస్‌రావుగౌడ్**



అభ్యర్థులను ప్రకటిస్తున్న కాసాని శ్రీనివాస్‌రావుగౌడ్ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జైస్వరాజ్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుం దని పార్టీ జాతీయ అధ్యక్షులు కాసాని శ్రీనివాస్‌రావుగౌడ్ ప్రకటించారు. ఇటీవల 11మంది అభ్యర్థులను ప్రకటించిన పార్టీ సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెండోవిడుతలో 53మంది జాబితాను విడుదల చేశారు. అనంతరం పార్టీ నాయకులు పరుశురాములుగౌడ్‌తో కలిసి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గత 60ఏళ్లుగా అనేక బలిదానాలు, కొట్లాటలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో భౌలికగా విభజన జరిగిందని కానీ సామాజికంగా అసమనతలు పోలేదన్నారు. 2014, 2018 మేనిఫెస్టోలో కేజీటు పీజీ విద్య ఉచితంగా ఇస్తామని చెప్పిన బిఆర్ఎస్ ప్రభుత్వం దానిని అమలు పరచడంతో విఫలమైం దన్నారు. ప్రతిపక్ష నాయకులు విధానపరంగా ముందుకు రావడం లేదని దుయ్యబట్టారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు గంగిడి మల్లారెడ్డి, శ్రీనివాస్‌బాబు, రాజ్‌కిరణ్, రాజేంద్రప్రసాద్‌లతోపాటు అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యం

**జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి**



ప్రచారం నిర్వహిస్తున్న మాగంటి గోపినాథ్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపినాథ్ నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీ కాంప్లెక్స్, పటేల్ కంపెనీ, బంజారా నగర్, జనప్రియ ప్రధాన రహదారి, శాస్త్రీ నగర్, హేమావతినగర్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం పనితీరు, డివిజన్‌లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరిస్తూ పాదయాత్ర, ఎన్నికల రథంపై ప్రచారం చేశారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో చూసి ముఖ్యంగా యువకులందరూ బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. నిరంతరం ప్రజల్లో తిరుగుతున్నానని, ప్రజా సమస్యలన్నీ ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించానన్నారు. అందుకే ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతిస్తున్నారని తెలిపారు. ప్రతి గల్లీ, ప్రతి గడప గులాబీమయంతో మారిందని, మరొకసారి ప్రజలు కారు గుర్తుకే ఓటు వేసి కెసిఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందజేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనకు కూడా హ్యాట్రిక్ అందిస్తారని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, షరీఫ్, పల్లవి, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద

జీడిమెట్ల, అక్టోబర్ 30, ప్రభాతవార్త : సురారంలోని భీమా గార్డెన్స్‌లో 130 సుభాష్‌నగర్ డివిజన్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే కెపి వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్ళ కాలంలో సీఎం కెసిఆర్ మార్గదర్శకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఉమ్మడి రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు నాడు పవర్ హోలిడేలు, మంచినీటి కష్టాలు నేడు లేవన్నారు. రాష్ట్రంలోని ఆడపడుచుల కోసం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలు, ఆసుపత్రిలో చేరి అప్పుల పాలైన నిరుపేతలను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, చేసిన సంక్షేమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు.



# ఎమ్మెల్యేను కలిసిన మరాఠ సమాజం ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో సోమవారం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మరాఠ సమాజ్‌కు చెందిన ముఖ్య నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. మరాఠ సమాజం కోసం అన్ని విధాల సహకారాన్ని అందిస్తున్నందుకు ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు తమ మద్దతును ప్రకటించారని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మరాఠ సమాజానికి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.





**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I Prakash Kaveri S/o Pralhadrao Kaveri R/o No 418/North, FLR-1, Road-2 Bandamkommu, Opp More Super market, Ameenpur-502032 has changed my name from Prakash Pralhadrao Kaweri to Prakash Kaveri for all my future purpose

(Ro.No.33506)

**LOST AND FOUND**

★ This is to inform that veterans Identity Card Number 4194/2018 was lost on 21-10-2023 near Artillery Center Hyderabad. Finder is requested to contact on 8696991111.

(Ro.No.33344)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE, CCC, SECUNDERABAD**
**O. S. No. 887 OF 2023**

BETWEEN:
**Smt. PHILOMENA SIMON & OTHERS ...PLAINTIFFS**
AND
**THE TAHSILDAR & OTHERS ...DEFENDANTS**

To,
**ALL CONCERNED (DEFENDANT NO.2)**

Whereas the above named Plaintiffs have filed suit for Declaration of legal heirs. You all are hereby summoned to appear in this court in person or by a pleader on **06.11.2023 at 10.30 'O' clock,** failing which the matter will be heard and determined in your absence as set-exparte.

(BY COURT ORDER)

**M/s. Dr. P. NAGESH**
**Smt. P. PUSHPAMALA**
**B. SHANKER**
**Advocates**
# 1-34, Block 'A' S-213, Green Gold Apartments, Santosh Nagar Colony, Opp: Amba Bhavani Temple, Malkajgiri, Hyderabad-47.
**Reliance: 9394755591**

**IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**O. S. No. 218 OF 2023**

BETWEEN:
**Saleem Khan ...Plaintiff**
AND
**1. M. Kantha Leela & others ...Defendants**

To,
**1. M. Kantha Leela,** W/o. Late Talari Ravi Kumar, Age about 55 years, Occ: House wife,
**2. T. Azeil,** S/o. Late Talari Ravi Kumar, Age about 33 years, Occ: Pvt. Service,
**3. T. Monika,** D/o. Late Talari Ravi Kumar, Age about 33 years, Occ: House wife, All are R/o. H.No. 6-3-1216/12, Flat No. 205, Deepak Apartment, Methodist Colony, Kundan Bagh, Begumpet, Hyderabad, T.S. PIN: 500016. **...Defendant No. 1 to 3**

Please take notice that whereas the above named plaintiffs herein has filed above suit i.e. O.S. No. 218 of 2023 against you for seeking specific performance against the Agreement of sale dt. 01.03.2016 and the above said suit is posted on **14.11.2023** for your appearance before the above mentioned court at **10.30 A.M.** either through your counsel or in person, if you failed to appear on the said date, the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE COURT)

**MUNEER BASSHA SHAIKH**
**SYED QUTUBUDDIN HUSSAINI**
**T. ASHOK KUMAR, G. VIDYASAGAR**
**SHAIK HUSSAINI AL AMOUDI**
**Advocates**
O/o. 17-9-158, Ground Floor, Firasath Residency, Kurmaguda, Sayeedabad, Hyderabad,
**Phone: 7013220596**
**COUNSELS FOR THE PLAINTIFF**

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **Gudumani Sadanand, S/o. Late. Balaiah, occu: Govt. Service, R/o. H.No.13-4-252, Subzimundi, Bhoiguda, Secunderabad, has lost his Original Registered Sale Deed Vide document No. 7261/1988, Dt.12-9-1988, in respect of open Plot No.172, in Sy.No. 747 and 750 admeasuring 200 Sq.yards, situated at Korremula Village, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District,** while he was shifting the house in spite of his best efforts he was unable to traced the same, if any person or persons are found the same to handover to the under signed, more so if any person proceed with any sale transaction behind back of my client the same may be at his/their own risk, for which my client shall not responsible and the said transaction became null and void not binding on my client.

**L. SATYANARAYANA**
**Advocate**
R/o. H.No.3-143, Balajinagar, Ghatkesar Village and Mandal Medchal-Malkajgiri District.
**Cell: 9848053162**

## మైనంపల్లిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మైనంపల్లి వాణి, ప్రేమ్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వెంకటేశ్వరనగర్ పోచమ్మ దేవాలయంలో పూజలు చేసి కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు మద్దతుగా మైనంపల్లి వాణి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 6 పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఉమేష్‌సింగ్, బికే శ్రీనివాస్, బి బ్లాక్ వెంకటేష్‌యాదవ్, సత్యమూర్తి, సత్యనారాయణ, శ్యామ్, రోజ రమణి, వెంకు, జలెందర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, కిషోర్, బిక్షపతి, నహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పారిజాత తనకు చెల్లెలుతో సమానం
## టిక్కెట్ కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాలకు అడ్డు రాను : కెఎల్ఆర్ సంచలన వ్యాఖ్యలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న చిగిరింత పారిజాత తనకు చెల్లెలుతో సమానమనీ టిక్కెట్‌కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాలకు తాను అడ్డురానని నియోజకవర్గానికి కాంగ్రెస్ అధిష్టానవర్గం ఎంపిక చేసిన అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నిక ప్రచార ప్రక్రియను ఆరంభించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌ను ఆశించిన వారంతా అర్హులేననీ అయితే పార్టీ అధిష్టానవర్గ నిర్ణయాన్ని శిరసావహించిన చల్లా నర్సింహారెడ్డి, యెల్మేటి అమరేందర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో ఆశావహురాలు చిగిరింత పారిజాత తనకు సోదరితో సమానమనీ ఆమె అభ్యర్థిగా ఎంపిక కాకపోయినా కాంగ్రెస్‌ను మాత్రం వీడనని ప్రకటించడం హర్షణీయమని ఆయన అభినందించారు. కాంగ్రెస్ టిక్కెట్ కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాలకు అడ్డురానని ఆయన పేర్కొన్నారు.

## క్రీడాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డా. వినోద్‌కుమార్, డా. శ్రీనివాసులు

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని హయత్‌నగర్ భాగ్యలత కాలనీ సమీపంలోని కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధనా సంస్థ(క్రీడ)లో అక్టోబరు 30 నుంచి నవంబరు 5వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం ఉదయం 11 గంటలకు క్రీడలో సంస్థ సంచాలకులు డా.వినోద్‌కుమార్, విజిలెన్స్ అధికారి డా.ఎం.శ్రీనివాసులు ఉద్యోగులందరితో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాలలో భాగంగా అవినీతి, అనైతిక చర్యల నిర్మూలన విజిలెన్స్ సంబంధిత విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి ప్రివెంటివ్ విజిలెన్స్ అండ్ విజిలెన్స్ మేనేజ్‌మెంట్ ఎథిక్స్ అండ్ గవర్నెన్స్ సిస్టమ్స్ అండ్ ప్రొసీజర్స్ ఆఫ్ ఆర్గనైజేషన్ మరియు సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీ అనే అంశాలపై నిపుణులు వివరించనున్నారని వారు తెలిపారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ వారి కోరిక మేరకు ప్రజల్లో ప్రజా ప్రయోజన ప్రైవేటీకరణ, ఫిర్యాదుదారుడి రక్షణ తీర్మాణంపై అవగాహన, ప్రచారంకోసం తెలుగు, ఆంగ్ల భాషలలో పోస్టర్లను రూపొందించి కార్యాలయ పరిసరాలు, కృషివిజ్ఞాన కేంద్ర దత్తత గ్రామాలలో ప్రదర్శించారు.

## ఘనంగా బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



ప్రతిభ చూపినవారిని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**వనస్థలిపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోయేషన్‌ఆధ్వర్యంలో వనస్థలిపురం పేస్1లోని రామాలయంలో బ్రాహ్మణ వధూవరుల 15వ వార్షిక పరిచయ వేదిక ఘనంగా జరిగిందని అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర్‌రావు, నందిరాజు లక్ష్మీ నారాయణ తెలియ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో 527 బ్రాహ్మణ యువత వివాహకోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్రాహ్మణ ప్రముఖనాయకులు బసవరాజు మాట్లాడుతూ పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కుల వృత్తిగా గుర్తించాలని, ఆర్థికంగా వెనకబడ్డ బ్రాహ్మణులు ప్రభుత్వ రాయితీలు పొందే విధంగా కుల, ఆదాయపు ధ్రువపత్రాలు పొందాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, గాదిరాజు ప్రసాద్, అడ్వకేట్ రమణ, ప్రభల, పివిబిడి శర్మ, బియస్.ప్రసాద్, వేదిక కన్వీనర్ చంద్రశేఖర్‌రావు, ప్రభాకరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతికాలనీలో కాంగ్రెస్ నేతల ప్రచారం



పద్మావతికాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పద్మావతికాలనీ, సెవెన్ హిల్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప,గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పల్ పద్మావతికాలనీ, సెవెన్‌హిల్స్ పలుప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డికి మద్దతుగా పలువురు పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటిలపై ఇంటింటికి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు అన్నిప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగ అంజయ్య, రఘునాద్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, గొరిగె మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, సుధాకర్, భాస్కర్, సంతోష్, వినయ్‌కుమార్, వీనాశమ్మ, ఇందురెడ్డి, దామస్, రాజు, ప్రశాంత్‌రెడ్డి, కిషోర్ రంగుల శేఖర్, రేణుక, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం అభివృద్ధికి కృషి : బిఎల్ఆర్



ఉప్పల్ చర్చికాలనీలో ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్,అక్టోబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ చర్చికాలనీ, లక్ష్మినారాయణకాలనీ తదితర ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలని, మరోసారి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కొత్త రామరావు, సీనియర్ నేతలు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## మర్రి గెలుపు - మల్కాజిగిరి అభివృద్ధికి మలుపు



నేరెడ్‌మెట్‌లో ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో మర్రి మమతారెడ్డి..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలిపించాలని ఆయన సతీమణి మర్రి మమతారెడ్డి డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, మహిళలతో కలసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి అభివృద్ధి మర్రి రాజశేఖర్ రెడ్డితోనే సాధ్యమన్నారు. డివిజన్ పరిధిలోని మహిళలకు బొట్టు పెడుతూ బి.ఆర్.ఎస్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ బి.ఆర్.ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## ఉప్పల్ బిజెపి సీటు బిసిలకు కేటాయించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ఉప్పల్ బిజెపి అసెంబ్లీ సీటును బిసిలకు కేటాయించాలని బిజెపి సీనియర్‌నేత ఉప్పోజి బల్వంతచారి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో విశ్వబ్రహ్మణ సంఘం కార్యదర్శి ఎం.రమేష్‌చారి, బిజెపి సీనియర్ నేతలు జాజుల నగేష్‌గౌడ్, బింగి దశరద్ గౌడ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో బల్వంతచారి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆలోచనలో భాగంగా కేంద్ర మంత్రి అమిత్‌షా తెలంగాణలో బిసి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించారని తెలిపారు. గత 75 సంవత్సరాలుగా రాష్ట్రంలో బిసి ముఖ్యమంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలనుంచి అగ్రవర్ణాలకు టిక్కెట్ ఇచ్చారని, వీరిని అడ్డుకునేందుకు బిజెపి నుంచి బిసి కోటా నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఒబిసి మోర్చలో పనిచేస్తున్నానని, పార్టీ అదేశాల మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. పార్టీ అవకాశం ఇస్తే ఉప్పల్‌లో భారీ మెజార్టీతో గెలిపిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన ఉప్పల్ యూత్ నేతలు

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి పలువురు అకర్షితులై పార్టీలో చేరు తున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్‌కు చెందిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పూదూరి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిలుకానగర్ డివిజన్‌కు చెందిన బిసి సెల్ అధ్య క్షుడు పండ్ల కిషన్‌గౌడ్, సీనియర్ నాయకులు బిక్కు, దయానంద్, సాయి బాబాకాలనీ మాజీ అధ్యక్షుడు ఎం.రమాకాంత్‌రెడ్డి, టౌన్‌కాంగ్రెస్ మాజీ ఉపా ధ్యక్షుడు తిరునగరి అనిల్‌కుమార్, కమల్, రవీందర్‌రెడ్డి, చంద్ర తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్‌లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ముగిసిన ప్యారా లీగల్ వాలంటీర్ల శిక్షణా శిబిరం

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** చట్టాలపై వాలంటరీలు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ సంస్థ అద్వర్యంలో కొత్తగా ఎంపిక చేయబడిన ప్యారా లీగల్ వాలంటీర్లకు శిక్షణా శిభిరం ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ముఖ్య అతిథిది హాజరై పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్యారా లీగల్ వాలంటీర్లకు లేబార్ చట్టాలు, పిల్లలకు సంబందించిన చట్టాలు, ఆస్తికి సంబందించిన చట్టాలు, లీగల్ సర్వీసెస్ చట్టాల గురించి ప్యారా లీగల్ వాలంటీర్లకు వివరించారు. రెండు రోజులు శిక్షణ తీసుకున్న ప్యారా లీగల్ వాలంటీర్స్ అందరికి త్వరలో గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామలదేవి, అమిత రాణి, ప్యారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## బడంగ్‌పేట నవయుగ ఎన్‌క్లేవ్ కాలనీ అధ్యక్షునిగా మురళీకృష్ణమాచారి ఎన్నిక

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ నవయుగ ఎన్‌క్లేవ్ కాలనీ అధ్యక్షునిగా మూడవ సారి మురళీకృష్ణమాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షునిగా చారిని, ప్రధానకార్యదర్శిగా రఘునాథ్, ఉపాధ్యక్షులుగా వినోద్‌కుమార్ యాదవ్, నిరంజన్‌గౌడ్, కోశాధికారిగా సత్యనారాయణ, సాంస్కృతిక కార్యదర్శిగా వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులుగా మోహన్‌రావు, స్నేహిత్ ఆచార్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగరాజు, ముఖ్య సలహాదారుగా చంద్రశేఖర్, సలహాదారులుగా డేవిడ్, గోపాల్, నాగేశ్, విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులుగా యాదగిరిరావు, రాజేశ్వర్‌రెడ్డి, నాగార్జునచారి, నాగ సుధాకర్, కిశోర్‌రావు, సందీప్, కృష్ణలను ఎన్నుకున్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డికి తోపుడు బండ్ల సంఘం నాయకుల మద్దతు

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన పోరాటం చేస్తుందని పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ తోపుడు బండ్ల సంఘం నేతలు నాగుర్‌బాషా, మల్లికార్జున్, హుస్సేన్, పకీరయ్య, బీరయ్య, చిన్న పీరయ్య, మాలు, జిల్లెల హుస్సేన్, రసూల్, కాశయ్య, చిన్న పీరయ్య, సిద్దమ్మ, సిరంబి, మస్తానమ్మ, కాసంబి, మౌలంబి తదితరులు బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను ఓడించే సత్తా ఉన్న పార్టీ బిజెపియే : ఈటెల రాజేందర్



బిజెపిలో చేరిన సిద్దాల దశరథకు కండువా వేస్తున్న ఈటెల రాజేందర్

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్‌ను ఓడించే ఏకైక పార్టీ బిజెపియేనని ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు, సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు సిద్దాల దశరథ పెద్ద సంఖ్యలోని తన వర్గీయులు, అనుచర గణంతో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక స్వాగత్ గ్రాండ్ వివేకానంద స్టాచ్యూ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటెల రాజేందర్ పార్టీలో చేరిన సిద్దాల దశరథ తదితరులకు కాషాయ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఈటెలను దశరథ గజమాల, గొంగడితో గొర్రె పిల్లనిచ్చి సన్మానించి కరవాలాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఆ తర్వాత కెసిఆర్‌ను, బిఆర్ఎస్‌ను ఓడించే సత్తా కేవలం బిజెపికే ఉందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, బిసిలపై నమ్మకం లేని కెసిఆర్‌కు ఆయా వర్గాల ప్రజలు ఓటు ఎందుకు వేయాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను బొందపెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మహేశ్వరం నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని ఈటెల సూచించారు. ఈ కార్యక్రమంలో కొలన్ శంకర్‌రెడ్డి, పాపయ్యగౌడ్, జంగయ్యగౌడ్, దేవేందర్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, పసునూరి బిక్షపతిచారి, జెనిగె శ్రీశైలం యాదవ్, సిద్దాల జగదీశ్, సిద్దాల శ్రీనివాస్, సిద్దాల మహేష్, చినింగి రమేష్, అచ్చిని అంజయ్య, అచ్చిని యాదగిరి, వెంకటేశ్వర్లు ముదిరాజ్, ముఖేష్ ముదిరాజ్, నర్ర రవీందర్, మద్ది శ్రీనివాస్ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నాచారం శ్రీరామ్‌నగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ గెలుపు కోసం ఏకగ్రీవ తీర్మాణం



పార్టీలో చేరిన నేతలతో కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పలువురు కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ సమక్షంలో చేరి బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా సాయిజన్ శేఖర్ వారిని పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. డివిజన్ అభివృద్ధికోసం కోట్ల రూపాయలవ్యయంతో అభివృద్ధి పనులను చేయించామని అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల ముత్యం రెడ్డి, మాజీ కార్పోరేటర్ తుంగ తిరుపతి, అంజన్న, మేడల మల్లికార్జున్ గౌడ్, దాసరి కర్ణ, శివ,టేకుపల్లి రాంచందర్, మారయ్య, భూపాల్‌రెడ్డితోపాటు పార్టీలో చేరిన వారు ఉన్నారు.

## కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలి : కేఎల్ఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కిచన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి మంత్రి పదవి  కోసం పార్టీ మారిన సభితా ఇంద్రారెడ్డిని ఈసారి ఓడించి తగిన బుద్ది చెపుతామమని మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్కేపురం లోని దేప భాస్కర్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నేతలతో అయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాకు మహేశ్వరం నియోజక వర్గ టికెట్ కేటాయించడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గతంలో నేను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని ఇప్పుడు కూడా ప్రజలకు సేవ చేసేందుకే ముందుకు వచ్చానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరు ఐక్యంగా ఉండి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు చల్ల నర్సింహ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, చిలుకా ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, అమరేందర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి పాల్గొన్నారు.

## పద్మశాలి దసరా మేళాను విజయవంతం చేయాలి



పద్మశాలి దసరా మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి నాయకులు

**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** నవంబర్ 5వ తేదీన నిర్వహించే పద్మశాలి దసరామేళాను విజయవంతం చేయాలని ఎల్బీనగర్‌సర్కిల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పున్న గణేష్ నేత విజ్ఞప్తి చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి సోమవారం పద్మశాలి మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎల్.రమణ, గుండు సుధారాణి, రాపోలు ఆనంద్ భాస్కర్, గూడూరు ప్రవీణ్, మధ్యప్రదేశ్ ప్రధాన కార్యదర్శి పరికి పండ్ల నరహరి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. పద్మశాలి కుల బాంధవుల వివాహాలతో పాటు పలు సమస్యలకు సంబంధించి మేళా ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల రవితేజ, గడ్డం జగన్నాథం, బొల్లా శివ, పెద్ది జగదీష్, వేముల రాము నేత, తులసిదాస్, వర్ణలీల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ అభివృద్ధి పేరుతో రూపొందించిన పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం. (ప్రభాతవార్త, నాచారం)

## అభివృద్ధి ప్రధాతకే పట్టం : కాలనీవాసులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

**వనస్థలిపురం,అక్టోబర్ 30 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్‌నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో ప్లై ఓవర్లు నిర్మించి ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు పలు అభివృద్దిపనులు చేపట్టామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం ఈస్ట్ కాలనీలో బిఎన్‌రెడ్డినగర్ వార్డు కమిటీ సభ్యుడు చాపల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల అధ్యక్షులు, ప్రజలు సుధీర్‌రెడ్డిని 3వసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్, వెంకటేష్‌గౌడ్, మధుగౌడ్, అభయ్‌యాదవ్, సిద్దార్థ్‌గౌడ్, గడల రాజు, విష్ణుమూర్తి, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పడకల శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, వివిధ కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తాం : రేవంత్‌రెడ్డి



టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ముజాఫర్‌ఖాన్, మందడి విజయసింహారెడ్డి, చిత్రంలో షేక్ అక్బర్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్‌జెండాను ఎగరవేస్తామని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు ముజఫర్‌ఖాన్, మందడి విజయసింహారెడ్డిలు నాయకులు, కార్యకర్తలతో కలిసి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2సార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ కార్పొరేటర్ ముజఫర్‌ఖాన్, ఒకసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన మందడి విజయసింహారెడ్డిలు తమ అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందన్నారు. మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి షేక్ అక్బర్ విజయంకోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలక్‌పేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతు పలుకుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘిరెడ్డి, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల సమస్యలపై రాష్ట్రపతికి ముర్ముకు వినతి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పత్రం అందజేస్తున్న అంధుల బృందం

**వనస్థలిపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** అఖిల భారత అంధుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు ఆధ్వర్యంలో అంధులబృందం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంధులకోసం తీసుకొచ్చిన కొత్త చట్టాలను సక్రమంగా అమలు కావడంలేదని, అంధుల సమస్యలు అంధులకు అర్థమవుతాయని రాష్ట్రస్థాయిలో కమిషనర్ దివ్యాంగుడు ఉండేలని చట్టం చెబుతున్న ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. సమస్యలు విన్న రాష్ట్రపతి వాటిని అమలయ్యేలా చూస్తామని హామీనిచ్చినట్లు చొక్కారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామినాయక్, రేణుక, శ్వేత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఎన్నికల ప్రచార జోరు



వినాయక్‌నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోకజవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మైనంపల్లి హన్మంత్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్‌నాయకులు పిట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వినాయక్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్  నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేసే మనసున్న వ్యక్తి మైనంపల్లి హన్మంత్‌రావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పంజా శ్రీనివాస్, బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, పిట్టల నాగరాజు, సత్యనారాయణ, సంజీవ, నాగప్ప, నరసింహ్మా, బాష, షరీఫ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారు : తీగల అజిత్‌రెడ్డి



మూసారాంబాగ్‌లో పర్యటిస్తున్న తీగల అజిత్‌రెడ్డి

**మలక్‌పేట,అక్టోబర్ 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మూసారాంబాగ్‌డివిజన్‌లోని రామాలయంటెంపుల్ ప్రాంతంలో అజిత్‌రెడ్డి పర్యటించి మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. అదేవిధంగా దిల్‌సుక్‌నగర్ ఎస్‌బిహెచ్ కాలనీ షటిల్ కోర్టు వద్ద దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అన్నారు. మలక్‌పేటలో బిఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, గౌర శశిధర్, జయప్రకాష్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.